# ప్రతి హిందువు గర్వించదగ్గ క్షణం..

- డీపీఎస్, పల్లవి విద్యా సంస్థల చైర్మన్ మల్కా కొమురయ్య
- ప్రతి గ్రామంలోనూ ప్రత్యేక ఏర్పాట్లు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు


మాట్లాడుతున్న ముత్యంరెడ్డి

మల్లాపూర్: అయోధ్య రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ప్రతి హిందువు గర్వించదగ్గ క్షణమని డీపీఎస్, పల్లవి విద్యా సంస్థల చైర్మన్ మల్కా కొమరయ్య అన్నారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ నుంచి చేపట్టిన మహా బైక్‌ర్యాలీని ఆయన ప్రారంభించారు. జై శ్రీరామ్ నినాదాలతో ఈ ర్యాలీ ఈసీఐఎల్ నుంచి ఘటేస్కర్ హనుమాన్ దేవాలయం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కొమరయ్య మాట్లా డుతూ 500 ఏళ్లుగా కోట్లాది హిందువులు ఈ అద్భుత ఘట్టం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా ప్రతి ఇంట్లో రామనామ జపం చేయాలన్నారు. కార్యక్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సీఈఓ మల్కా యశ్వసి, తదితరులు పాల్గొన్నారు.

**ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు**

రామంతాపూర్ : అయోధ్యలోని భవ్య రామాలయం ప్రారంభోత్సవం బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం భారీ వెండితెరపై ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు రామంతాపూర్ ప్రధాన రహదారిలోని నల్ల పోచమ్మ దేవాలయంతో పాటు స్థానిక రమాసహిత సత్యనారాయణ దేవాలయం ఆడిటోరియంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు బీజేపీ సీనియర్ నేతలు తిండేరు హనుమంతరావు, బండారు వెంకట్‌రావు తెలిపారు. ప్రత్యక్ష ప్రసారం అనంతరం అన్న ప్రసాద వితరణ ఉంటుందన్నారు.

**ఇళ్లల్లో దీపాలు వెలిగించాలి**

మల్లాపూర్: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ఆలయాల్లో పూజలతో పాటు ఇళ్లలో దీపాలను వెలిగించాలని మల్లాపూర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి ముత్యంరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 35 ఏళ్ల ఉద్యమం ఫలితంగా బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ జరుగుతోందన్నారు. ప్రజలందరూ సమీప ఆలయాల్లో భజనలు, పూజలు చేయాలని, సాయంత్రం ఇళ్లలో కనీసం 5 దీపాలు వెలిగించాలని కోరారు. సమావేశంలో సీనియర్ బీజేపీ నేతలు కేశవరం ఆంజనేయులు, అచ్చగోని సతీష్‌గౌడ్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆలేటీ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.


ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. లక్ష్మీ సొగంధీ శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది.

## ఎస్‌ఐకి ఆటో డ్రైవర్ల సన్మానం

మేడ్చల్: విశిష్ట సేవా పతకం సాధించిన మేడ్చల్ ఎస్‌ఐ నర్సింహ్మాగౌడ్‌ను మేడ్చల్‌కు చెందిన ఆటో డ్రైవర్లు సన్మానించారు. ఆదివారం పలువురు ఆటో డ్రైవర్లు మేడ్చల్ పోలీస్‌లో ఆయనను పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సన్మానించారు.



## వ్యాయామం జీవితంలో భాగం కావాలి


బహుమతి అందజేస్తున్న వేదాకాంత్, జావీద్

బోడుప్పల్: దైనందిన జీవితంలో ఆరోగ్యవంతంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని సినీనటుడు వేదాకాంత్ అన్నారు. ఆదివారం బోడుప్పల్‌లోని స్టార్ ఫిట్‌నెస్ స్టూడియో జిమ్ లక్కీ డ్రా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మారుతున్న జీవన శైలిని దృష్టిలో ఉంచుకుని ప్రతి రోజు వ్యాయామం చేయాలని సూచించారు. స్టార్ ఫిట్‌నెస్ స్టూడియో జిమ్ నాలుగు బ్రాంచిలను నడుపుతుందని, ఏటా బోడుప్పల్‌లో నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జిమ్ సభ్యుల కోసం లక్కీ డ్రా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిమ్ నిర్వాహకులు మహమ్మద్ జావీద్, బాలకృష్ణ, రాహుల్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా తీశారు. విజేతగా ఎంపికైన జిమ్ సభ్యుడు ఆశిష్‌కు వేదాకాంత్, మహమ్మద్ జావీద్ బహుమతి అందజేశారు.

## నేడు ఉప్పల్ సర్కిల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రారంభం

రామంతాపూర్ : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని హబ్సిగూడ, రామంతాపూర్, ఉప్పల్, చిలుకానగర్ డివిజన్లకు సంబంధించిన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని సోమవారం ఉదయం హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్–8లో జీహెచ్ఎంసీ భవనంలో ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ నాలుగు డివిజన్‌లోని ప్రజల సమస్యలు సంక్షేమ పథకాల అమలు తదితర కార్యక్రమాలు క్యాంప్ కార్యాలయం నుంచే కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.

## కరాటేతో ఆత్మ విశ్వాసం

బోడుప్పల్: విద్యార్థులు చదువుతోపాటు ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే విద్యలు నేర్చుకోవాలని బోడుప్పల్ 19వ డివిజన్ కార్పొరేటర్ సామల పవన్‌రెడ్డి అన్నారు. రెంజుకి షాటోకాన్ కరాటే క్లబ్ ఫౌండర్ నగేష్ ఆధ్వర్యంలో ఆదివారం బోడుప్పల్‌లో నిర్వహించిన కరాటే బెల్ట్ పరీక్షల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఢిల్లీలో జరిగిన ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో 100మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో గెలుపొందిన వారికి బెల్ట్‌లు అందజేశామన్నారు. నేటి యువతకు విద్యతోపాటు క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ అవసరమన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేసిన కార్పొరేటర్

## లక్ష్మినగర్ పార్కును పునఃప్రారంభించాలి

బోడుప్పల్: లక్ష్మినగర్ కాలనీలోని పార్కులో త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి చేసి పునః ప్రారంభించాలని కాలనీవాసులు అన్నారు. ఈ మేరకు ఆదివారం బిడబ్ల్యూ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిడబ్ల్యూ ఫ్రెండ్స్ ప్రతినిధులు మాట్లాడుతూ గతంలో పార్కులో వందలాది మంది వాకింగ్ చేసేవారని, మరమ్మతుల పేరుతో పార్కును మూసివేయడంతో వాకర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పార్కులో వెనక వైపు ప్రహరీ, పాడైన గ్రానైట్ పలకలకు మరమ్మతు చేయాలన్నారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, బాత్ రూంలు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

## దళిత బంధు అమలు చేయాలి

మల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన దళిత బంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని ఎస్సీ బేడ బుడగ జంగం హక్కుల సాధన సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు గగనం వెంకట స్వామి అన్నారు. ఆదివారం ఆయన మల్లాపూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎంపికైన వారందరికీ దళిత బంధు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి శ్రీనివాసులు, కుంటి కృష్ణ, నరేష్, దుర్గాప్రసాద్, అశోక్, యాక స్వామి తదితరులు పాల్గొన్నారు.

## ‘అద్దంకి దయాకర్‌కు అన్యాయం చేశారు’


అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దళిత సంఘం నాయకులు

గౌతంనగర్: దళిత నాయకుడు అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి దక్కకుండా అడ్డుకోవడం దారుణమని పలువురు దళిత నేతలు అన్నారు. ఆదివారం మల్కాజిగిరి దళిత సంఘం ఆధ్వర్యంలో గౌతంనగర్‌లోని బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దళిత నాయకుడైన అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇవ్వకపోవడం దారుణమన్నారు. దయాకర్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు కన్నమళ్ల నాగరాజు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సీఐకి మేయర్ శుభాకాంక్షలు


మేడిపల్లి సీఐకి శుభాకాంక్షలు తెలుపుతున్న మేయర్ జక్కా వెంకట్ రెడ్డి

మేడిపల్లి: మేడిపల్లి పోలీస్‌స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన గోవింద రెడ్డి ని పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొడెపోచయ్య , ఎంపాల అనంత రెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, రఘువర్ధన్ రెడ్డి, ప్రభు, జావిద్‌ఖాన్ మల్లం వెంకటేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఏర్పాటు



అల్వాల్: భూదేవినగర్ సన్‌రైజ్ ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం జరిగిన ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్షుడిగా బోమిలే నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కాలేవార్ భాస్కర్, కోశాధికారిగా ప్రదీప్ మనోహర్, ఉపాధ్యక్షులుగా కొమరం బలరాం, ప్రకాష్‌రావు, దమయంతి, సంయుక్త కార్యదర్శులుగా తాళ్ల శ్రీకాంత్, అమిత్‌గుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మురళీ, కల్చరల్ సెక్రటరీగా శీతల, సలహాదారులుగా ఆశీర్వాదం, ముజిమిల్, సభ్యులుగా శ్రీకాంత్, ప్రవీణ్, ప్రశాంత్, విశ్వాస్, చంద్రశేఖర్, సంతోష్‌గౌడ్, మహేందర్, భాస్కర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## తలనొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య



మేడిపల్లి: తలనొప్పి భరించలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పీర్జాదిగూడ బుద్దానగర్ కాలనీకి చెందిన చిట్టిమల్లె వీరేశం కుమారుడు బాలరాజు(20) డిగ్రీ రెండో సంవత్సరం చదువుతూ డెలివరీ బోయ్‌గా పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నాడు. గత కొన్ని నెలలుగా అతను తలనొప్పితో బాధపడుతున్నాడు. శనివారం రాత్రి తలనొప్పి తీవ్రం కావడంతో తట్టుకోలేక ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రెస్టారెంట్ నిర్వాహకుల అరెస్ట్

అల్వాల్: మత విద్వేషాలు రెచ్చగొట్టేలా డాక్యుమెంటరీ ప్రదర్శించిన రెస్టారెంట్ నిర్వాహకులపై నేరేడ్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. డిఫెన్స్ కాలనీలోని మార్లేస్ జాయింట్ బిస్ట్రో రెస్టారెంట్‌లో ఈ నెల 20న రాత్రి ఓ డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ డాక్యుమెంటరీ మతవిద్వేషాలను రెచ్చగొట్టేలా ఉండటంతో రెస్టారెంట్‌కు వచ్చిన వినియోగదారుడు రిత్విక్ యజమానిని ప్రశ్నించగా వారి వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో రిత్విక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నలుగురిని అరెస్ట్ చేశారు.

## శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ముగ్గుల పోటీలు



అల్వాల్: అయోధ్య శ్రీరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని అల్వాల్ బ్రాహ్మణ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఓల్డ్ అల్వాల్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో రాముడికి స్వాగతం పలుకుతూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. రామాయణంలోని ఘట్టాలను అందమైన ముగ్గులతో తీర్చిదిద్దారు. అనంతరం విజేతలకు శ్రీరామచంద్రమూర్తి, శ్రీధర్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శారద, గీత, పద్మజ, లక్ష్మీ, భాస్కర్, రాము, దుర్గా, మృదుల తదితరులు పాల్గొన్నారు.

